క్లుప్తంగా

రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

దర్శి: 33 కేవీ దర్శి ఫీడర్ లైన్ మరమ్మతులు, నూతన లైన్‌లు ఏర్పాటు కారణంగా దర్శి ఎస్ఎస్పీ సబ్ స్టేషన్ పరిధిలో ఉండే అద్దంకి రోడ్డు, పుచ్చలమెట్ట, ఆటోనగర్, మోటుపల్లి రోడ్డు, ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని ఏఈ సచ్చిన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 03:00 గంటల నుంచి సాయంత్రం 06:00 గంటల వరకు, గురువారం ఉదయం 06:00 గంటల నుంచి 09:00 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలియజేశారు.వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించగలరని కోరారు.

డీజే సౌండ్ బాక్సులు వాడరాదు

● దర్శి సీఐ వై రామారావు

దర్శి: దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల పరిధిలో ఫంక్షన్లకు తిరునాళ్లకు, ఏదైనా ఇతర కార్యక్రమాలకు ఎవరైనా మైకు సిస్టం వాడే సమయంలో డీజే లకు అనుమతి లేదని దర్శి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై రామారావు అన్నారు. ఫంక్షన్లు, ఉత్సవాలు, తిరునాళ్ల, మీటింగులు జరుపుకునే వారు కచ్చితంగా స్థానిక ఎస్సై ద్వారా సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అనుమతికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పర్మిషన్ పొందిన వారు మైకు లేదా ఏదైనా సౌండ్ బాక్స్ లు పరిమిత సంఖ్యలో మాత్రమే వాడుతూ సౌండ్ మించకుండా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

బుట్టి దిలీప్‌కు బెస్ట్ టీచర్ అవార్డు



రవీంద్ర భారతిలో అవార్డు అందుకుంటున్న బుట్టి దిలీప్

పెద్దదోర్నాల: క్రీస్తు సైన్యం చిల్డ్రన్స్ మినిస్ట్రీ వ్యవస్థాపకుడు బుటి దిలీప్‌కుమార్‌కు బెస్ట్ వీవీఎస్ టీచర్ అవార్డు లభించింది. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్ గద్దలపాటి విజయరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో బుట్టి దిలీప్‌కు అవార్డును అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లో చిన్నారులను ఆధ్యాత్మికంగా, మానసికంగా చైతన్యవంతులుగా మార్చినందుకు ఈ అవార్డు లభించింది.

ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవం



మాట్లాడుతున్న మానసిక నిపుణులు లావణ్య

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు ప్రిన్సిపాల్ పిబే ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సమగ్ర శిక్ష మానసిక నిపుణులు నారాయణం లావణ్య మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు డి రత్నప్రియ, జీ నీలిమ, విద్యాలయం కమిటీ చైర్మన్ ఆవులక్క పాల్గొన్నారు.

తీయని పూడిక.. కదలని మురుగు!



మొక్కలతో పూడిపోయిన తూము



మురుగులో రాళ్లపై నడక

తాళ్లూరు: మండలంలో అభివృద్ధి చెందుతున్న పంచాయతీల్లో తూర్పుగంగవరం ప్రథమ స్థానంలో ఉంది. దారంవారిపాలెం వెళ్లే దారిలో ఉన్న హరిదాస్ కాలనీలో నివసిస్తున్న ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర దాటినా సైడ్ కాలువల్లో పూడిక తీయక పోవడంతో పిచ్చి మొక్కలు మొలిచి చెత్తా చెదారం పేరుకుపోయింది. మురుగు ఇళ్లల్లోకి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇళ్లల్లోకి మురుగు వస్తుండటంతో సొంత ఇళ్లను వదిలి అద్దె ఇళ్లల్లో వేల రూపాయలు చెల్లించి నివాసం ఉండాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దారంవారిపాలెం రోడ్డు మార్గంలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి నుంచి తూర్పు, పడమరకు సైడ్ కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పంచాయతీ అధికారులు, సర్పంచ్, నాయకుల చుట్టూ తిరిగినా పట్టించుకోకుండా ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ ఉండి దోమలు విజృంభిస్తున్నాయని, విష జ్వరాల ప్రభావం అధికంగా ఉందని చెప్తున్నారు. సర్పంచ్, పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి హరిదాస్ కాలనీలో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి ప్రజల సమస్యలకు వెంటనే పరిష్కరిస్తామన్నారు.

అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నాం:



మేం వితంతువులం. చాలా కాలంగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. కాలనీ వాసులు ఇళ్లల్లో వాడుకునే నీరు నుంచి కురిసిన చిన్నపాటి వర్షం దాకా అన్నీ మురుగు నీరు ఇళ్ల మీదకు వస్తున్నాయి. సొంత నిధులతో ట్రాక్టర్ మట్టి తోలించినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో ఏం చేయాలో తెలియక అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటూ వేల రూపాయలు వెచ్చిస్తున్నాం. మురుగు తొలగించి సైడ్ కాలువలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

కాశిమల్ల ఈశ్వరమ్మ, కుమారి

అధికారులు పట్టించుకోవాలి:



అధికారులు మాపై చిన్నచూపు ఎందుకో అర్థం కావడం లేదు. మురుగు నీరు ఇళ్ల ముందు చేరి దోమలు అధికంగా ఉంటున్నాయి. విష జ్వరాలు వస్తున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే మురుగు నీరు వెళ్లేలా శాశ్వత పరిష్కారం చూపాలి.

నంబూరి చంద్రమ్మ

నష్టాల బాటలో టమోటా రైతులు



టమోటాను గ్రేడ్ చేస్తున్న కూలీలు



పెద్దారవీడులో సాగు చేసిన టమోటా పంట

పెద్దారవీడు: ఖరీఫ్ సీజన్లో టమోటా పంట సాగు చేసిన రైతులు నష్టాలబాట పట్టారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో రైతులు టమోటా సాగు చేశారు. మొక్కలు నాటిన దగ్గర నుంచి కాయలు కోసే వరకు పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన రైతుల కంట కన్నీరు ఉబుకుతోంది. వ్యవసాయాన్నే నమ్ముకుని బతుకు బండిని నడిపే రైతులు చేసేది లేక వారిలో వారే కుమిలిపోతున్నారు. పంట సాగు కోసం అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు కూడా రావని రైతులు దిగాలు చెందుతున్నారు. ఎకరా పొలంలో మొక్కలు నాటిన దగ్గర నుంచి కాయలు కోత కోసే వరకు, కూలీలకు, ఎరువులు, రసాయన మందులకు దాదాపు రూ.40 నుంచి రూ.50 వేలు వరకు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. మార్కాపురం మార్కెట్లో 25 నుంచి 30 కేజీల బాక్స్‌కు మొదటి రకం రూ.200 నుంచి రూ. 250 వరకు ధర పలుకుతోంది. అందులో ఆటో బాడుగ ఒక బాక్స్‌కు రూ.30, ఒకరికి కోత కూలి రూ.300, ఎగుమతి, దిగుమతి రూ. 10, మార్కెట్‌లో వ్యాపారుల కమీషన్ నూటికి రూ.5 చొప్పన తీసుకుంటారు. 25 కేజీల బాక్స్ కనీసం రూ.400పైగా ధర పలికితే గిట్టుబాటు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. కష్టపడి పంట పండించుకుంటే కాయలు అమ్మడానికి వచ్చే సమయానికి మార్కెట్‌లో గిట్టుబాటు ధరలేక రైతులు కుదేలవుతున్నారు. కనీసం 25 కేజీల బాక్స్ రూ.400 వరకు మద్దతు ధర కూడా పలకడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట దిగుబడి వచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో నష్టాలు మిగులుతున్నాయని వాపోతున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టిన ఖర్చులు కూడా రావడం లేదని టమోటా రైతులు నిలువునా నష్టపోతున్నారు. పండించిన పంటను నిల్వ చేసి మరుసటి రోజు అమ్మకాలు చేసే పరిస్థితి లేక పోవడంతో కొనుగోలుదారులు అడిగిన ధరలకే రైతులు పంటను అమ్ముకోవాల్సిన వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం టమోటాకు మద్దతు ధర కల్పించి చేదోడు వాదోడుగా ఉండాలని, నష్టాల నుంచి బయటపడే విధంగా ఆదుకోవాలి రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి:

రెండు ఎకరాల పొలంలో టమోటా పంట సాగు చేశా. ఎరువులు, సేద్యం ఖర్చులు, కాయల కోత కూలి, రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు వస్తున్నాయి. పంటకు పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నా. గిట్టబాటు ధర కల్పించి టమోటా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎం.బాలరాజు, రైతు, పెద్దారవీడు

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి



మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈవో

పుల్లలచెరువు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని ఎంఈవో ఇందిర అన్నారు. మంగళవారం మండలంలోని ముటుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీని ఆమె పరిశీలించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు వడ్డించే భోజనం పరిశుభ్ర ప్రదేశంలో ఈగలు, దోమలు లేకుండా చూసుకుని రుచికరంగా తయారు చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూను తప్పక పాటించాలని చెప్పారు. రోజూ ఉపాధ్యాయులు తనిఖీ చేసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో ఇందిర హెచ్చరించారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్ర పటానికి పూజ చేస్తున్న వాల్మీకులు

కురిచేడు: వాల్మీకి జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాల్మీకి బజారులో అంకె శ్రీను ఆధ్వర్యంలో వాల్మీకి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారి చిత్ర పటాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకులు, భక్తులుపెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికులకు ఈ–కేవైసీ తప్పనిసరి



ఈ-కేవైసీ చేస్తున్న మేటీ

దొనకొండ: గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్లే శ్రామికులకు ఈ–కేవైసీ తప్పనిసరి అని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో కళ్యాణి తెలిపారు. మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో 30 రెవెన్యూ గ్రామాల్లో 12281 జాబ్ కార్డులు ఉన్నాయని, అందులో 22322 శ్రామికులు పని చేస్తున్నారన్నారు. సోమవారం వరకు 3814 మంది శ్రామికులకు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ఈకేవైసీ చేస్తున్నారని తెలిపారు. ఉపాధి పథకంలో అక్రమాలు జరగకుండా పని చేసే ప్రదేశంలో ముఖ హాజరు తీసుకుంటారన్నారు. ఈకేవైసీ నాలుగు రోజుల్లో తమ సిబ్బంది పూర్తి చేస్తారన్నారు. త్వరలో ఉపాధి పనులు కూడా ప్రారంభిస్తామని కళ్యాణి వివరించారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ ప్రత్యేక పూజలు



త్రిపురాంతకం కుమారగిరి ప్రదక్షిణలో భక్తులు

త్రిపురాంతకం: పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం వద్ద పౌర్ణమి సందర్భంగా కుమార గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తజనులు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రతి పౌర్ణమికి భారీగా తరలి వచ్చి భక్తులు నిర్వహిస్తున్నారు. ఈగిరి ప్రదక్షిణలో ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో వస్తున్న భక్తులు పాల్గొని తరిస్తున్నారు. ప్రదక్షిణ అనంతరం స్వామి అమ్మవార్లకు అభిషేకంలు, కుంకుమార్చన ప్రత్యేక పూజలను ఆలయ అర్చకుడు విశ్వనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

జాగిలాలతో పట్టణంలో తనిఖీలు



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

దర్శి: మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాల నివారణలో భాగంగా రాక్సీ జాగిలంతో దర్శి పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు డీఎస్పీ లక్ష్మీ నారాయణ పర్యవేక్షణలో సీఐ రామారావు, ఎస్సై మురళీలు దర్శి పట్టణంలోని వివిధ దుకాణాలు, ఆర్టీసీ బస్టాండ్, జనసంచారం ఉండే కూడళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఒంగోలు నుంచి వచ్చిన జాగిలంతో తనిఖీలు చేస్తుండటంతో స్థానికులు ఆసక్తి కనబరిచారు.

పెద్దదోర్నాలలో వాన బీభత్సం



పెద్దదోర్నాలలో కురిసిన వర్షానికి రోడ్డుపైనే పారుతున్న వర్షపు నీరు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. మంగళవారం మధ్యాహ్నం అర్ధగంట పాటు కుండపోతగా వర్షం కురవటంతో మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రీశైలం రహదారిలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపైనే ఉధృతంగా ప్రవహించటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కురిసిన వర్షంతో మండలంలో సాగులో ఉన్న పత్తి, మిరప పంటలకు మేలు జరుగుతుందని పలువురు రైతుల హర్షం వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల మురికి కాలువల నిర్వహణ సరిగా లేకపోవటంతో వర్షపు నీరు రోడ్లపైనే ప్రవహించింది. వాన తీవ్రతకు మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీ, ఐనముక్కల బీసీ కాలనీ, ఫారం వీధి తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి.

సీజేఐపై దాడిచేసిన వారిని శిక్షించాలి



దర్శిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న దళిత నాయకులు



దొనకొండలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

దర్శి: దేశ అత్యున్నత సుప్రీం కోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని దళిత సేన నియోజక వర్గ కార్యదర్శి గర్నెపూడి ప్రేమ్ కుమార్, నవ్యంధ్ర మాదిగ చర్మ,డప్పు కళాకారుల సంఘం అధ్యక్షులు కవలకుంట్ల గోవింద్ ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. దర్శి ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల రిబ్బన్‌లతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతుండగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై బూట్ విసిరివేయడాన్ని ఖండించారు. దేశ న్యాయ వ్యవస్థకి కలంకం తెచ్చే విధంగా వ్యవహరించారని మండి పడ్డారు. యావత్ భారతదేశంలో ఉన్న ప్రజలందరూ ఈ దాడిని ఖండించాలన్నారు. ఇటువంటి ఘటన మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం చట్టపరచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎర్రగుంట్ల నాగేశ్వరరావు, దొంతులూరి కోటేష్, పూసల ఓబయ్య, నరసింహ, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: సీజేఐపై దాడి రాజ్యాంగంపై దాడిగా భావిస్తున్నామని ఎంఆర్‌పీఎస్ దండోరా, వైఎస్సార్‌సీపీ తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భద్రతా సిబ్బందిని పెద్ద మొత్తంలో నియమించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ దండోరా అధ్యక్షులు గుంటు పోలయ్య మాదిగ డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నుంచి ర్యాలీగా బయలుదేరి అడ్డరోడ్డులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో రైల్వే పింఛనర్స్ కార్యదర్శి జయరాజు, యం.ధర్మారావు, బి.ఆశీర్వాదం, ఎస్.రాములు, జె.నాగయ్య, విజయానందం, క్రిస్టఫర్, కె.కరుణాకర్, సాల్మన్, పాపారావు, కాలేబ్ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు సాగు నిషేధం

● తహసీల్దార్ రజనీకుమారి



పొగనారు మడులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ

కురిచేడు: జీవో నంబర్ 740 ప్రకారం నల్ల బర్లీ పొగాకు సాగుపై నిషేధం ఉందని, రైతులెవరూ సాగు చేయవద్దని తహసీల్దార్ జి.రజిని కుమారి తెలిపారు. మండలంలోని కురిచేడులో పొగాకు నర్సరీలను సోమవారం మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులైన తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి, పోలీస్ కానిస్టేబుల్ సందర్శించారు. పొగనారు సాగు చేసిన రైతులతో మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి బి.సంపత్ కుమార్ మాట్లాడుతూ తెల్ల బర్లీ పొగాకు కంపెనీ వాళ్లతో అగ్రిమెంటు ఉంటే మాత్రమే రైతులు సాగు చేయాలని సూచించారు.

పోషకాహారంతో గర్భిణులకు ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్ వైజర్ సుభాషిణి

దర్శి: పోషకాహారంతో గర్భిణులకు ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్ సుభాషిణి సూచించారు. రామాలయం గుడి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో అధిక పోషకాహారం తీసుకునే విధనం గురించి తెలియజేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాలిచ్చే తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ముండ్లమూరు మండలం సూపర్వైజర్ ఇందిర, ఉల్లగల్లు సూపర్వైజర్ సునీత, దర్శి సచివాలయం-1 మహిళా పోలీస్ ఎం సరస్వతి, దర్శి-1 సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ

కొత్తూరులో పౌష్టికాహార వారోత్సవాలు

పెద్దదోర్నాల: గర్భిణులు, బాలింతలు, రక్తహీనత నివారించుకునేందుకు ఆకుకూరలు విరివిగా వినియోగించుకోవాలని సీడీపీఓ లక్ష్మీబాయి సూచించారు. మండల పరిధిలోని కొత్తూరులో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గర్భిణులు అందుబాటులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి కేంద్రాలు అందించే పౌష్టికాహారం తీసుకోవటంతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తల సలహాలు, సూచనలు పాటించి తల్లిబిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలన్నారు.

జీఎస్టీతో నిత్యావసర ధరల్లో తగ్గుదల

తాళ్లూరు: జీఎస్టీ 2.0తో నిత్యావసర సరుకుల ధరలు తగ్గనున్నాయని.. దీంతో పేద మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భారం తగ్గనున్నట్లు ఎంఈవోలు సుబ్బయ్య ,సుధాకర్ రావు, ఎంపీడీవో పి.అజిత అన్నారు. మండలంలోని అన్నీ ప్రభుత్వ హైస్కూల్ లో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్‌పై అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో డి.నాగ మల్లేశ్వరి, హెచ్‌ఎం ఆరోన్ మిలటన్, వైఎస్సార్ కే. ప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో అజిత

మురికిమళ్ల ఆశ్రమ పాఠశాలకు అవార్డు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం బయ్యన్న

పుల్లలచెరువు: స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని మురికిమళ్ల గిరిజన ఆశ్రమ పాఠశాల జిల్లాలో మొదటి స్థానం సాధించింది. అందులో భాగంగా సోమవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు చేతుల మీదగా హెచ్‌ఎం బయ్యన్న అవార్డు అందుకున్నారు. గిరిజన సంక్షేమ శాఖలో జిల్లాలోనే మురికిమళ్ల గిరిజన ఆశ్రమ పాఠశాల మొదటి స్థానం సాధించడంలో విశేష కృషి చేసిన హెచ్‌ఎం బయ్యన్నను పలువురు అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

చందలూరు పాఠశాలకు స్వచ్ఛ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు

దర్శి: కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డుల కార్యక్రమంలో భాగంగా పాఠశాల విభాగంలో చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్వచ్ఛ పాఠశాల అవార్డు లభించింది. ఈ అవార్డును జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంధం గురు ప్రసాద్ అందుకున్నారు. పాఠశాలకు అవార్డు వచ్చిన సందర్భంగా ఎంపీడీవో పి కల్పన, ఎంఈఓ కాకర్ల రఘురామయ్యలు హర్షం వ్యక్తం చేశారు.